కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం

రైతుల పరిస్థితి దయనీయంగా మారుతోంది. ఓ వైపు అకాల వర్షాలతో నష్టపోయిన అన్నదాతలకు మిగిలిన ధాన్యాన్ని అమ్ముకోలేని దుస్థితి ఏర్పడింది. కొనుగోలు కేంద్రాల వద్ద సేకరించిన ధాన్యం మిల్లర్లు తీసుకెళ్లకపోవడంతో సరఫరా నిలిచిపోతోంది. దీంతో ఐకేపీల వద్ద నిల్వ చేసేందుకు స్థలం లేక అన్నదాతలకు చుక్కెదురవుతోంది. ఎప్పుడు వర్షం వస్తుందో.. ధాన్యం తడుస్తుందేమోనని రైతులు ఆందోళన చెందుతున్నారు.

- లారీల కొరతతో పేరుకుపోతున్న వైనం
- తరుగు, తూకాల పేరిట దోపిడీ
- ఆందోళన చెందుతున్న రైతులు
- చోద్యం చూస్తున్న అధికారులు



యాచారం కొనుగోలు కేంద్రంలో మిల్లుకు తరలించేందుకు నింపిన ధాన్యం బస్తాలు



రైతులు విక్రయానికి తెచ్చిన ధాన్యం

యాచారం: కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం నిల్వలు కుప్పలుగా పేరుకుపోతున్నాయి. రోజు కొనుగోలు చేసిన ధాన్యాన్ని అదే రోజు తరలించడం లేదు. వర్షాలు కురిస్తే సేకరించిన ధాన్యం పూర్తిగా తడిసి ముద్దయ్యే అవకాశం ఉంటుంది. సేకరించిన ధాన్యంతో పాటు రైతులు తెచ్చిన ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్దే నిల్వ చేస్తున్నారు.

నాలుగు కేంద్రాల్లో 400మంది రైతుల విక్రయాలు

మండల పరిధిలోని 24 గ్రామాల్లో యాసంగిలో 8 వేల ఎకరాలకు పైగా వరి పంట సాగు చేశారు. భూగర్భజలాలు పుష్కలంగా ఉండడంతో దిగుబడి బాగానే వచ్చింది. యాచారం, నందివనపర్తి, చింతపట్ల, మంతన్‌గౌరెల్లి గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఆయా సెంటర్ల వద్ద 400మందికి పైగా రైతులు 2,500 క్వింటాళ్ల ధాన్యాన్ని విక్రయించారు. మరో 2వేలకు పైగా క్వింటాళ్ల ధాన్యం వచ్చే అవకాశం ఉంది.

పేరుకుపోతున్న ధాన్యం నిల్వలు

మండల పరిధిలోని నాలుగు ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో వరి ధాన్యం నిల్వలు కుప్పలుగా పేరుకుపోతున్నాయి. నాలుగు కేంద్రాల్లో సేకరించిన ధాన్యాన్ని మొదట నల్గొండ జిల్లా చింతపల్లి మండల కేంద్రంలోని ఊరే శ్రీనువాస్ రైస్ మిల్లుకు తరలించే వారు. అనంతరం ఇబ్రహీంపట్నంలోని రైలు మిల్లుకు తరలించారు. రెండు మిల్లుల్లో టార్గెట్ పూర్తి కావడంతో ప్రస్తుతం ఆమనగల్లు, తలకొండపల్లి కేంద్రాల్లో ఉన్న మిల్లులకు ధాన్యాన్ని తరలించాల్సి ఉంది. ప్రస్తుతం ఇక్కడకు ధాన్యం తరలించడంతో జాప్యం జరుగుతోంది. ఇప్పటి వరకు 22 లారీల ధాన్యం తరలించారు. ప్రస్తుతం ఆయా కేంద్రాల్లో 20 లారీలకు పైగా ధాన్యం నిల్వ ఉంది. కేంద్రాల నుంచి సకాలంలో ధాన్యాన్ని తరలించకపోవడంతో నిర్వహకులు రైతుల నుంచి ధాన్యాన్ని సేకరించే విషయంలో తీవ్ర జాప్యం చేస్తున్నారు. కొనుగోలు కేంద్రాల్లో నిల్వ ఉన్న ధాన్యాన్ని సేకరించకపోవడంతో వర్షాలు కురిస్తే ధాన్యం తడిసిపోతే పూర్తిగా నష్టపోతామని రైతులు ఆందోళన చెందుతున్నారు.

తరుగు పేరిట దోపిడీ

కొనుగోలు కేంద్రాల నిర్వహకులు తరుగు, తూకాల పేరుతో నిలువు దోపిడీ చేస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. 40కిలోల బస్తాకు 4 కిలోలకు పైగానే తరుగు తీస్తున్నారని వాపోతున్నారు. తరుగు, తూకాల్లో మోసాలతో మంతన్‌గౌరెల్లి కొనుగోలు కేంద్రం వద్ద 15రోజులుగా రైతులు ఆందోళన, ధర్నాలు చేస్తూనే ఉన్నారు. శుక్రవారం కొనుగోలు కేంద్రం వద్ద ధాన్యం దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు. ఇప్పటి వరకు సేకరించిన 2,500 క్వింటాళ్ల ధాన్యంలో 300 నుంచి 500లకు పైగా క్వింటాళ్ల ధాన్యం తరుగు పేరుతో దోపిడీ జరిగిందని ఆరోపిస్తున్నారు. మోసాలపై నిర్వహకులను ప్రశ్నిస్తే కొర్రీలు పెట్టి ఇబ్బందులకు గురి చేస్తున్నారని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారులకు ఫిర్యాదులు చేసినా స్పందన లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

చర్యలు తీసుకుంటాం



ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద నిల్వలు పేరుకుపోయాయి. ఇప్పటికే 22 లారీల ధాన్యాన్ని తరలించాం. ఇంకా 15 లారీలకు పైగా ధాన్యం నిల్వ ఉంది. ఇప్పటికే ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చాం. రెండు రోజుల్లో నిల్వ ఉన్న ధాన్యాన్ని తరలిస్తాం. కొనుగోలు కేంద్రాల వద్ద తరుగు, తూకాల్లో మోసాలు జరగకుండా చర్యలు తీసుకుంటున్నాం. రైతులు ఫిర్యాదులు చేస్తే బాధ్యులైన నిర్వాహకులపై చర్యలు తీసుకుంటాం. రైస్ మిల్లర్లపై సైతం నిఘా ఉంచాం. – సందీప్‌కుమార్, వ్యవసాయాధికారి

క్లుప్తంగా

టీడీపీ రాష్ట్ర కార్యదర్శిగా రవీందర్



ఇబ్రహీంపట్నం: టీడీపీ రాష్ట్ర కార్యదర్శిగా పట్టణానికి చెందిన జలమోని రవీందర్ రెండోసారి నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్ ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా రవీందర్ మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో పదవి ఇచ్చిన పార్టీ జాతీయ అధక్ష్యుడు చంద్రబాబు నాయుడు, రాష్ట్ర అధ్యక్షుడు కాసానికి, సహకరించిన ప్రతీ ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీకి పూర్వవైభవం తెచ్చేందుకు నిరంతరం కృషి చేస్తున్నానన్నారు.

ఉపాధి పనుల్లో నిర్లక్ష్యం తగదు

ఇన్‌చార్జి ఎంపీడీఓ క్రాంతికిరణ్



ఇబ్రహీంపట్నం: ఉపాధి పనుల్లో నిర్లక్ష్యం తగదని ఇబ్రహీంపట్నం ఇన్‌చార్జి ఎంపీడీఓ క్రాంతికిరణ్ అన్నారు. శనివారం ఆయన మండల పరిధిలోని వివిధ గ్రామాలల్లో చేపడుతున్న ఉపాధి పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఉపాధి సిబ్బంది కూలీలకు పనులు కల్పించడంలో నిర్లక్ష్యం వహించొద్దన్నారు. ఎండల తీవ్రతను దృష్టిలో పెట్టుకుని పని ప్రదేశంలో కూలీలకు ఇబ్బందులు కలుగకుండా చర్యలు చేపట్టాలన్నారు. కూలీలకు అందాల్సిన బకాయి బిల్లులు వెంటనే చెల్లించేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. కొత్త జాబ్ కార్డులకు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు.

ప్రతీగింజ కొనుగోలు చేస్తాం

మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి

ఆమనగల్లు: ప్రభుత్వం రైతులు పండించిన ప్రతీ గింజను కొనుగోలు చేస్తోందని రైతులు అధైర్యపడవద్దని ఆమనగల్లు మార్కెట్ కమిటీ చైర్మన్ నాలాపురం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మాడ్గుల మండల కేంద్రంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శనివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ రైతుల ధాన్యాన్ని చివరి గింజ వరకు కొనుగోలు చేస్తామని చెప్పారు. రైతులు దళారులను ఆశ్రయించి మోసపోవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్లు సుభాష్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

చిరువ్యాపారులకు గొడుగులు

కడ్తాల్: మండల కేంద్రంలో జాతీయ రహదారికి ఇరువైపులా ఉన్న ఫుట్‌పాత్ చిరు వ్యాపారులకు ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ రాఘవేందర్ రెడ్డి తోడ్పాటునందించారు. శనివారం ఫౌండేషన్ ఆధ్వర్యంలో 45 మంది చిరువ్యాపారులకు గొడుగులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ సభ్యులు మాట్లాడుతూ.. పేదలకు సాయం చేసేందుకే ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ రాఘవేందర్‌రెడ్డి సహకారంతో చిరువ్యాపారులకు గొడుగులు పంపిణీ చేశామన్నారు.

మతిస్థిమితం లేని వ్యక్తిని..

మానసిక దివ్యాంగుల ఆశ్రమానికి తరలింపు



ఆశ్రమ నిర్వాహకుడికి దివ్యాంగుడిని అప్పగిస్తున్న పోలీసులు

అబ్దుల్లాపూర్‌మెట్: మతిస్థిమితం సరిగ్గా లేని ఓ వ్యక్తిని పోలీసులు దివ్యాంగుల ఆశ్రమంలో చేర్పారు. ఈ ఘటన అబ్దుల్లాపూర్‌మెట్ పీఎస్ పరిధిలో చోటుచేసుకుంది. వివరాల ప్రకారం.. మూడు రోజులుగా మతిస్థిమితం సరిగాలేని ఓ గుర్తు తెలియని వ్యక్తి మండల పరిధిలోని బాటసింగారం గ్రామం లాజిస్టిక్ పార్కు సమీపంలో తిరుగుతున్నాడు. శనివారం వేసవి తాపానికి నిస్సహాయ స్థితిలో ఉండడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పెట్రోలింగ్ విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుళ్లు సురేశ్, భరత్‌కుమార్‌లు అక్కడికి వెళ్లి ఆ వ్యక్తికి భోజనం తినిపించి వారి వాహనంలో మండల కేంద్రంలోని ఆలేటి ఆటం మానసిక దివ్యాంగుల ఆశ్రమానికి చేర్పారు. ఈ సందర్భంగా సీఐ మన్మోహన్ తమ సిబ్బందిని అభినందించారు.

సెల్‌ఫోన్ల దొంగ అరెస్ట్



నిందితుడు ఆకాశ్

అబ్దుల్లాపూర్‌మెట్: సెల్‌ఫోన్లు అపహరిస్తున్న దొంగను పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. అతడి నుంచి ఎనిమిది సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అబ్దుల్లాపూర్‌మెట్‌కు చెందిన మల్లెల శ్రావణ్‌కుమార్ తన సెల్‌ఫోన్ చోరీకి గురికావడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు క్రమంలో జోనూరు ఆకాశ్ అనే వ్యక్తిని అదుపులోకి తీసుకుని పోలీసులు విచారించారు. సెల్‌ఫోన్ అపహరించినట్లు ఒప్పుకున్నారు. నిందితుడి నుంచి ఎనిమిది సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు.

నేటి నుంచి బీరప్ప పండుగ

మంచాల: మండల పరిధిలోని లోయపల్లి గ్రామంలో ఆదివారం నుంచి బీరప్ప స్వామి, కామరాతి దేవి కల్యాణోత్సవాలు నిర్వహించనున్నట్లు మార్కెట్‌కమిటీ డైరెక్టర్, ఉత్సవ నిర్వహకులు నారి యాదయ్య శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. 28న ఉదయం కొట్నం, పుట్టపూజ, వడక లగ్నం, సాయంత్రం బోనాల ఊరేగింపు ఉంటుందన్నారు. 29న ఉదయం 10.45గంటలకు బీరప్ప స్వామి, కామరాతి కల్యాణోత్సవం, మధ్యాహ్నం 2.35గంటలకు గొర్ల మందలకు, గుడికి బలి చల్లుట, 30, 31న ఒగ్గు కథ, నాగవెల్లి, హారతి పూజలుంటాయి. జూన్ 1న మైలలతో పండుగ పూర్తవుతుందన్నారు.

పాఠశాలల్లో పారిశుద్ధ్య కార్మికులను నియమించండి

ఎస్టీయూ టీఎస్ అసోసియేట్ అధ్యక్షుడు ఏవీ సుధాకర్

మంచాల: నూతన విద్యా సంవత్సరం నాటికి పాఠశాలల్లో పారిశుద్ధ్య కార్మికులను నియమించాలని ఎస్టీయూ టీఎస్ అసోసియేట్ అధ్యక్షుడు ఏవీ సుధాకర్ శనివారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. పాఠశాలల్లో స్కావెంజర్లు లేక అపరిశుభ్ర వాతావరణం నెలకొంటుందన్నారు. దీంతో విద్యార్థులు, ఉపాధ్యాయుల ఆరోగ్యం దెబ్బతింటున్నదని వాపోయారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయాలని కోరారు.

పార్లమెంట్ భవనానికి అంబేడ్కర్ పేరుపెట్టాలి

జెడ్పీటీసీ సభ్యురాలు అనురాధ



అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆందోళన చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

ఆమనగల్లు: నూతన పార్లమెంటు భవనానికి ప్రపంచ మేధావి భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ పేరు పెట్టాలని జెడ్పీటీసీ సభ్యురాలు అనురాధ, మార్కెట్ కమిటీ చైర్మన్ నాలాపురం శ్రీనివాస్‌రెడ్డి, వైస్ ఎంపీపీ జక్కు అనంతరెడ్డి, టీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పానుగోటి అర్జున్‌రావు డిమాండ్ చేశారు. పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో శనివారం అంబేడ్కర్ విగ్రహం వద్ద పార్లమెంటు భవనానికి అంబేడ్కర్ పేరు పెట్టాలని డిమాండ్ చేస్తూ నిరసన వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నియంత పాలన సాగిస్తోందని ఆరోపించారు. ప్రధాని మోదీ నిరంకుశంగా వ్యవహరిస్తూ ప్రతిపక్షాల అభిప్రాయాలను పట్టించుకోవడం లేదని ఆరోపించారు. బీజేపీ ప్రభుత్వం రాష్ట్రపతి గౌరవాన్ని కాపాడాలని, భవనాన్ని రాష్ట్రపతి చేతులమీదుగా ప్రారంభించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పత్యానాయక్, పంతునాయక్, జయరాంనాయక్, నిట్టె నారాయణ, కమటం వెంకటయ్య, చుక్క నిరంజన్‌గౌడ్, రమేశ్‌నాయక్, శంకర్, వడ్డె వెంకటేశ్, రమేశ్, శివ, యాదయ్య, మల్లేశ్, వస్పుల సాయిలు, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

బాల్యవివాహాలు చట్టరీత్యా నేరం

జెడ్పీటీసీ సభ్యురాలు నిత్యారెడ్డి



మాట్లాడుతున్న నిత్యారెడ్డి

మంచాల: బాల్య వివాహాలు చేయడం చట్టరీత్యా నేరమని జెడ్పీటీసీ సభ్యురాలు మర్రి నిత్యారెడ్డి, జిల్లా సంక్షేమ అధికారి పద్మజారమణ అన్నారు. శనివారం మండల పరిధిలోని దాద్‌పల్లిలో బాల్యవివాహాలపై ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మైనర్లకు వివాహాలు చేస్తే అనర్థాలు ఎదురవుతాయని చెప్పారు. చిన్న వయస్సులో వివాహం చేస్తే ఆరోగ్యంపై ప్రభావం పడుతుందని చెప్పారు. ఆడపిల్లలను చదువుల్లో పోత్సహించి ఉన్నతంగా ఎదిగేందుకు సహకరించాలని సూచించారు. ఎవరైనా బాల్యవివాహాలు చేస్తే జరిపే వారిపైతో పాటుగా హాజరయ్యే వారుకూడా శిక్షార్హులు అన్నారు. ప్రతీ గ్రామంలో బాలల పరిరక్షణ కమిటీ ఏర్పాటు చేశామన్నారు. సర్పంచ్ కన్వీనర్‌గా, కార్యదర్శి, అంగన్‌వాడీ టీచర్లు, ఏఎన్‌ఎం, స్కూల్ టీచర్లు, ఇద్దరు విద్యార్థులు ఈ కమిటీలో సభ్యులుగా ఉంటారని వివరించారు. బాల్య వివాహాలు చేస్తే 1098కి ఫోన్ చేయాలని సూచించారు. మహిళ శక్తి కేంద్రం కో–ఆర్డినేటర్ విజయ్‌భాస్కర్ పలు చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌బీ కో ఆర్డినేటర్ హర్షవర్ధిని, సర్పంచ్ దోర్బి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, పంచాయతీ కార్యదర్శి, అంగన్ వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను వినియోగించుకోండి



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

ఆమనగల్లు: ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ కోరారు. మండల పరిధిలోని ఆకుతోటపల్లి గ్రామానికి చెందిన యాదయ్యకు సీఎంఆర్ఎఫ్ నుంచి రూ.2.50లక్షల చెక్కు మంజూరైంది. ఈ మేరకు ఎమ్మెల్యే వారి కుటుంబ సభ్యులకు శనివారం తన నివాసంలో చెక్కు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సీఎంఆర్ఎఫ్‌తో పేదలకు కార్పొరేట్ వైద్యం అందుతోందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జీఎల్ఎస్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, టీఆర్ఎస్ నాయకులు నిరంజన్‌గౌడ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

పోడు భూములపై హక్కులు కల్పించండి

చీపునుంతల రైతుల డిమాండ్



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న రైతులు

తలకొండపల్లి: పోడు భూములుపై హక్కులు కల్పించి, పట్టా పాసుబుక్‌లు ఇవ్వాలని చీపునుంతల రైతులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు శనివారం రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ కృష్ణకు వినతిపత్రం అందజేశారు. గ్రామ శివారు ప్రాంతంలో ఉన్న ఫారెస్టులోని 71 సర్వే నెంబర్‌లోని 32 ఎకరాలను 1954 నుంచి మా 20 కుటుంబాల పూర్వీకులు సాగు చేసుకున్నారు. 20 ఏళ్లుగా ఫారెస్టు అధికారులు భూములు సాగు చేయకుండా అడ్డుకున్నారు. ఫారెస్టు భూములు దున్నవద్దని మా వద్ద ఉన్న భూ దస్తావేజులు, కాగితాలను లాక్కున్నారు. మేము సాగు చేసినట్లు కాస్తు మా పేర్ల మీద ఉందని వారు వినతిపత్రంలో పేర్కొన్నారు. మేము సాగు చేసిన భూములపై హక్కులు కల్పించి పోడు పట్టాలు మంజూరు చేయాలని తహసీల్దార్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో గడ్డమీది బాలయ్య, కొాట్ర గోపాల్, రామయ్య, గోస్కె లక్ష్మయ్య, గిరి, యాదమ్మ, గోపాల్, కొాట్ర రామయ్య, చెన్న కేశవులు, బోయ రాములు, మల్లయ్య, నర్సింహ, తదితర రైతులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే సుస్థిర పాలన

డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి



సమావేశంలో పాల్గొన్న నాయకులు

ఆమనగల్లు: కాంగ్రెస్ పార్టీతోనే సుస్థిర పాలన సాధ్యమని డీసీసీ అధికార ప్రతినిధి గూడూరి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు, యువకులు ఆత్మబలిదానాలు చూసి.. తెలంగాణ ప్రజల ఆకాంక్షలను గౌరవించి సోనియాగాంధీ నాడు ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఇచ్చారని గుర్తు చేశారు. వచ్చిన తెలంగాణలో సీఎం కేసీఆర్ కుటుంబం ప్రజలను మోసం చేస్తున్నారని ఆరోపించారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు మరిచారన్నారు. రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా సోనియా గాంధీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు శ్రీపాతి శ్రీనివాస్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, పార్టీ మండల అధ్యక్షుడు మండ్లి రాములు, కాంగ్రెస్ పట్టణఅధ్యక్షుడు వస్పుల మానయ్య, బ్లాక్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు ఖలీల్, నాయకులు అబ్దుల్ ఖాదర్, పులికంటి మైసయ్య, రాఘవేందర్, శివరాజ్ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల ఆశ్రమం నుంచి వ్యక్తి అదృశ్యం



శ్రీరామచౌదరి (ఫైల్)

అబ్దుల్లాపూర్‌మెట్: మానసిక దివ్యాంగుల ఆశ్రమం నుంచి ఓ వ్యక్తి అదృశ్యమయ్యాడు. ఈ ఘటన అబ్దుల్లాపూర్‌మెట్ పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వెలమాటి శ్రీరామచౌదరి (45) మండల కేంద్రంలోని ఆలేటి ఆటం ఆశ్రమంలో రెండు నెలలుగా ఉంటున్నాడు. ఈ నెల 24న ఆశ్రమం నుంచి బయటకు వెళ్లిన ఆయన తిరిగి ఆశ్రమానికి రాలేదు. దీంతో ఆశ్రమ నిర్వాహకులు ఈ విషయాన్ని అతని సోదరుడు కృష్ణశాంక్‌కు సమాచారం ఇచ్చారు. ఎక్కడ వెతికినా ఆచూకీ లభించకపోవడంతో ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తులో ఉంది.

మహిళ ఆత్మహత్య

తలకొండపల్లి: జీవితంపై విరక్తి చెంది ఓ మహిళ ఆత్మహత్య చేసుకున్న ఘటన మండల పరిధిలోని గట్టుఇప్పలపల్లిలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ వెంకటేశ్‌యాదవ్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన ఇంద్రకంటి అంజమ్మ తన కూతురు అశ్వినిని షాద్‌నగర్ జిల్లా కేశంపేట్‌కు చెందిన వెంకటేశ్‌గౌడ్‌కు ఇచ్చి మూడు సంవత్సరాల క్రితం వివాహం చేశారు. వీరికి ఇద్దరు పిల్లలు. వివాహానికి ముందే అశ్వినికి గొంతుకు సర్జరీ అయ్యింది. ఎండ వేడికి తట్టుకోలేక అశ్విని అనారోగ్యం పాలైంది. ఈ నెల 26న పుట్టినిల్లు గట్టుఇప్పల పల్లికి చేరుకుంది. అదేరోజు సాయంత్రం ఎవరూలేని సమయంలో ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. పోస్టుమార్టం నిమిత్తం శవాన్ని కల్వకుర్తి ఆస్పత్రికి తరలించారు. మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శనివారం తెలిపారు.

మామిడికాయల దొంగలకు రిమాండ్

యాచారం: ఇద్దరు మామిడికాయల దొంగలను పోలీసులు అరెస్టు చేసి శనివారం రిమాండ్‌కు తరలిపంచారు. నగరానికి చెందిన క్లింటన్, వినోద్‌కుమార్‌లు చౌదర్‌పల్లి గేట్ సమీపంలో ఎండీ రహమాన్‌కు చెందిన మామిడి తోటలో రెండు రోజుల కింద మామిడికాయలు కోసి కారులో నగరానికి తరలిస్తున్నారు. మామిడితోటను లీజుకు తీసుకున్న శ్రీనువాస్ గమనించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు దర్యాప్తు చేపట్టిన పోలీసులు క్లింటన్, వినోద్‌కుమార్‌లను అరెస్టు చేసి శనివారం రిమాండ్ చేశారు.

నాణ్యమైన విత్తనాలే అమ్మండి

రైతు బంధు మండల కో ఆర్డినేటర్ నర్సింహా



మాట్లాడుతున్న నర్సింహ

తలకొండపల్లి: రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించాలని రైతుబంధు మండల కో ఆర్డినేటర్ నర్సింహ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని రైతు వేదికలో ఆయన విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నర్సింహ మాట్లాడుతూ.. పొరుగు రాష్ట్రాల నుంచి నాసిరకం విత్తనాలు తెచ్చి రైతులకు అంటగట్టడంతో వారు తీవ్రంగా నష్టపోతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఆరుగాలం కష్టించే రైతన్నలకు ప్రతీ ఒక్కరు సహకరించాలని కోరారు. డీలర్, సబ్‌డీలర్లు నాసిరకం విత్తనాలు, మందులు అమ్మొద్దని సూచించారు. నేల రకాన్ని బట్టి అధిక దిగుబడినిచ్చే పంటలపై రైతులకు అవగాహన కల్పించాలని సంబంధిత అధికారులకు చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అన్నివిధాలా సహకరిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో రైతుబంధు గ్రామ అధ్యక్షుడు పాండు, గణేశ్, శ్రీరాములు, మల్లేశ్, కుమార్, చంద్రయ్య, యాదయ్య, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

తొలిప్రధానికి ఘన నివాళి



కడ్తాల్: నెహ్రూ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎన్ఎస్‌యూఐ నాయకులు

కడ్తాల్: భారతదేశ మొదటి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ దేశానికి చేసిన సేవలు చిరస్మరణీయమని ఎన్ఎస్‌యూఐ మండల అధ్యక్షుడు షాబుద్దీన్ అన్నారు. శనివారం ఆయన వర్ధంతి సందర్భంగా శ్రీశైలం–హైదరాబాద్ జాతీయ రహదారిపై మండల కేంద్రంలోని ప్రధాన కూడలిలో ఆయన చిత్రపటానికి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు అజ్గర్‌అలీ, క్యామ రాజేశ్, శ్రీకాంత్, లింగం, యూత్ కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు భానుకిరణ్, ఎన్ఎస్‌యూఐ గ్రామ అధ్యక్షుడు వంశీ, నాయకులు పవన్, దర్శన్, టిల్లు, లడ్డూ, మహేశ్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

మహనీయుడు.. నెహ్రూ

తలకొండపల్లి: దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపించిన మహనీయుడు నెహ్రూ అని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి అన్నారు. శనివారం ఆయన వర్ధంతి సందర్భంగా బస్టాండ్ ప్రాంతంలో నెహ్రూ చిత్రపటానికి నివాళి అర్పించారు. పలువురు మాట్లాడుతూ.. సాగునీటి కోసం అనేక ప్రాజెక్టులు నిర్మించి ఆహార ధాన్యాల ఉత్పత్తిని పెంచిన మహానుభావుడన్నారు. డీసీసీ కార్యదర్శి రవీందర్‌యాదవ్, సోషల్ మీడియా అసెంబ్లీ కన్వీనర్ అజీం, పోషయ్య, అఖిల్‌బాబా, శ్రీను, మైసయ్య, ఇస్మాయిల్, అంజి, కృష్ణ, రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

మంత్రి సహకారంతో మౌలిక వసతులు

బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రాజునాయక్

మహేశ్వరం: గిరిజన తండాల్లో మౌలిక వసతుల కల్పనకు మంత్రి సబితారెడ్డి కృషి చేస్తోందని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు అంగోత్ రాజునాయక్, రామచంద్రగూడ సర్పంచ్ శివి నాయక్ అన్నారు. శనివారం మండల పరిధిలోని ఘట్టుపల్లి–పెండ్యాల వయా రామచంద్రగూడ బీటీ రోడ్డు నిర్మాణ పనులను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రతీ గిరిజన తండాకు సీసీ, బీటీ రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణాలతో పాటు ఆర్టీసీ బస్సు సర్వీసులను కల్పిస్తోందన్నారు. మంత్రి ప్రత్యేక చొరవతో గిరిజన తండాలు, గ్రామాలను కలిపే లింకు రోడ్ల నిర్మాణానికి రూ.9.40 కోట్ల నిధులు మంజూరయ్యాయని గుర్తు చేశారు. మహేశ్వరం–మన్సాన్‌పల్లి ఉప్పుగడ్డ తండా రోడ్డు నిర్మాణానికి రూ.3.20కోట్ల నిధులు, సంత్ సేవాలాల్ ఆలయ నిర్మాణానికి కోటి రూపాయలను మంజూరు చేయించారన్నారు. ఘట్టుపల్లి–పెండ్యాల వయా రామచంద్రగూడ బీటీ రోడ్డు నిర్మాణ పనులు రూ.35లక్షలతో జరుగుతున్నాయన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ ఎస్టీ సెల్ నియోజకవర్గ కార్యదర్శి రమేశ్‌నాయక్, వార్డు సభ్యులు సిద్దేశ్వర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.